## ఉర్సు ఎల్లమ్మ దేవాలయ అభివృద్ధికి శ్రీకారం



**దశ, వరంగల్:** మంత్రి వర్యులు కొండా సురేఖ మురళీధర్ ల ఆదేశానుసారము శుక్రవారం రోజున ఉర్సు ఎల్లమ్మ దేవాలయమును కోటి రూపాయలతో అభివృద్ధి చేయుటకు గాను 40వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు బత్తిని అఖిల్ అధ్యక్షతన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్ ఉర్సు ఎల్లమ్మ దేవాలయమును సందర్శించి అభివృద్ధికి కావలసిన వివరాలను సేకరించినారు. పనులను కూడా త్వరలోనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఇట్టి కార్యక్రమములో కాంగ్రెస్ నాయకులు మీసాల ప్రకాష్, గౌడ కులస్తులు నాగపూరి సంజయ్ బాబు, గొడిశాల సత్తిబాబు, గట్టు రమేష్, నాగపూరి బుజ్జిబాబు, బత్తిని నవీన్, నాగపూరి అశోక్, మాచర్ల చందు, బైరగొని ఓంకార్, పల్లె రవి, నాగపూరి రాజు, వడ్లకొండ సతీష్, మరియు గౌడ కులస్తులు పాల్గొనడం జరిగింది.

## తెలంగాణ డిజిటల్ కేబుల్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా కమటం వేణుగోపాల్



**దశ, వరంగల్:** తెలంగాణ డిజిటల్ మీడియా కేబుల్ న్యూస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కమిటీని ప్రకటించడం జరిగింది. వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా A1 టీవీ మీడియా ఛానల్ కమటం వేణుగోపాల్ ని రాష్ట్ర కమిటీ అధికారకంగా నియమించడం జరిగింది. దివి: 13032026 నుండి రెండు సంవత్సరాల కాలం పాటు వేణుగోపాల్ పదవిలో కొనసాగుతారని తెలంగాణ డిజిటల్ కేబుల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాచర్ల గోపి ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు రాచర్ల గోపి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కమటం వేణుగోపాల్ కి శుభాకాంక్షలు తెలుపుతూ కేబుల్ ఛానల్ వ్యవస్థలో పనిచేస్తున్న ప్రతి ఒక్క జర్నలిస్టుకి అందవలసిన పథకాలు అందించే విధంగా కృషి చేయాలని కోరారు.

## విద్యార్థినిలు శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



**దశ సూర్యాపేట ప్రతినిధి :** విద్యార్థినిలు శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి అని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఇమాంపేట కేజీవిబి పాఠశాలలో విద్యార్థినిలు కోతులతో ఇబ్బంది పడుతున్నారని గ్రీల్స్ నిర్మించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినిల భద్రతను దృష్టిలో పెట్టుకొని స్ప్రెడ్ ఇంటర్నేషనల్ సంస్థ చైర్మన్ పటేల్ శ్రీధర్ రెడ్డి సహకారంతో లక్ష ఇరవై వేల వ్యాయంతో మంకీ ప్రొటెక్షన్ గ్రీల్స్ నిర్మించడం అభినందనీయమని అన్నారు. కస్తూర్బా గాంధీ మైనార్టీ బాలికల విద్యాలయం దత్తత తీసుకున్న దగ్గర నుండి ఇప్పటివరకు అన్ని రకాలుగా అభివృద్ధి చేశామని అన్నారు. కలెక్టరు పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ కిట్లు ఇవ్వడం జరిగిందని వాటిని విద్యార్థినిలకు అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనలో విద్య, వైద్యానికే ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. విద్యార్థినిలు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, ఎంఈఓ శేషగాని శ్రీనివాస్ గౌడ్, జి సి డి ఓ పూలన్ దేవి, స్కూల్ ప్రిన్సిపాల్ డి నారాయణమ్మ, ఉపాధ్యాయులు సోనా బేగం, షాహినా బేగం, కాంచన, రాధిక, దేవి, దుర్గ భవాని, జ్యోతి, నిర్మల, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా భద్రతా అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించిన సూర్యాపేట రూరల్ పోలీస్

- *సామాజిక భద్రత అందరి బాధ్యత.*
- *యువత, విద్యార్థులు స్వీయనియంత్రణ కలిగి ఉండాలి.*
- *సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలి.*
- *చిన్న వయస్సులో ప్రేమ ఆకర్షణలకు లోనై భవిష్యత్తును కోల్పోవద్దు*
- *కె.నరసింహ ఐపిఎస్, ఎస్పి సూర్యాపేట జిల్లా*




**దశ, సూర్యాపేట ప్రతినిధి :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి చందన నర్సింగ్ విద్యాసంస్థల నందు భద్రతా అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ హాజరై విద్యార్థులకు స్వీయ నియంత్రణ, సామాజిక మాధ్యమాల ద్వారా కలిగే నష్టాలు, రోడ్డు భద్రత ప్రమాదాల నివారణ, సైబర్ మోసాల నిర్మూలన, మహిళలు, విద్యార్థుల భద్రత, డ్రగ్స్ మత్తు పదార్థాల నిర్మూలన భద్రతా అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు స్వీయ నియంత్రణ కలిగి ఉండాలని, ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని కష్టపడి చదువుకోవాలని కళలను సాకారం చేసుకోవాలి, తల్లిదండ్రులకు విద్యాసంస్థలకు మంచి పేరు తేవాలని అన్నారు.

ఆకతాయిలు చెప్పే మాటలు, చేష్టలను నమ్మి ప్రేమాకర్షణలకు లోనై బంగారు భవిష్యత్తును కోల్పోకూడదు సూచించారు. సామాజిక భద్రతకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని స్వీయ నియంత్రణ కలిగి ఉండాలని కోరారు. ప్రస్తుత సమాజంలో రోడ్డు ప్రమాదాల ద్వారా అధికంగా పౌరులు మరణిస్తున్నారని, అనారోగ్యంతోనో, దేశ రక్షణలోనో మరణించే వారి సంఖ్య కన్నా ఎక్కువగా రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు అన్నారు. రోడ్డు ప్రమాదాలను నిర్మూలించడానికి రోడ్డు నియమాల పట్ల, రోడ్డు వినియోగం పట్ల అవగాహన ముందు జాగ్రత్తలే ప్రధాన ఆయుధాలని తెలిపారు. రోడ్డు వినియోగించే సమయంలో చుట్టూ ఉన్న ప్రమాదాలు, అడ్డంకులు గమనించి ముందుకు సాగాలి. రోడ్డు ప్రయాణ సమయంలో ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు హెల్మెట్లు తప్పనిసరిగా ధరించాలని, కారులు పెద్ద వాహనాల్లో ప్రయాణించేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు.

హెల్మెట్ పెట్టుకోవడం సీట్ బెల్ట్ పెట్టుకోవడం వల్ల మరణాలను తగ్గించవచ్చని అన్నారు. యువత, పౌరులు డ్రగ్స్ మత్తుకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆరోగ్యాలు కోల్పోతున్నారని అన్నారు. డ్రగ్స్ మత్తులో నేరాలు సైతం చేస్తున్నారని తెలిపారు. డ్రగ్స్ ను మన సమాజం నుండి తొలగించాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని దీనికి సంబంధించిన సమాచారం పోలీసువారికి అందియాలని విజ్ఞప్తి చేశారు. మహిళల భద్రత పిల్లల భద్రతలో పోలీస్ శాఖ అత్యంత అక్రమంగా ఉందని వేధింపులకు సంబంధించిన సమాచారాన్ని పోలీసు వారికి అందించాలని ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమం నందు సూర్యాపేట డివిజన్ డిఎస్పి ప్రసన్నకుమార్, సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, స్థానిక ఎస్సై బాలు నాయక్, చందన విద్యాసంస్థల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.



## తడి, పొడి చెత్తలను వేరువేరుగా అందించాలి : మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత

**దశ సూర్యాపేట ప్రతినిధి :** తడి, పొడి చెత్తలను వేరువేరుగా అందించేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి అన్నారు. ప్రజాపాలన ప్రగతిప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక 29వ వార్డులో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ప్రతి వీధిలోకి వచ్చే స్వచ్ఛ ఆటోలకు ప్రజలు అందజేయాలని కోరారు. ప్రతి ఇంట్లో రెండు రకాల చెత్తను తప్పని సరిగా వేరు చేస్తేనే దాన్ని మళ్లీ ఉపయోగంలోకి తెచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. చెత్తను డ్రైనేజీ, మోరీ, బహిరంగ ప్రదేశాల్లో పడేయడం వల్ల దోమలు పెరిగి ప్రజలు రోగాలబారిన పడతారని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో 29 వ వార్డు కౌన్సిలర్ రాపర్తి భవాని శ్రీనివాస్, శానిటరి ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ రాపర్తి శ్రీనివాస్, అనంతుల యాదగిరి, నాయకులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ

**దశ, వరంగల్:** ఇందూరు తిరుమలగా ప్రసిద్ధి చెందిన గోవింద వనమాల క్షేత్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామివారి 12వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర అటవీ, పర్యావరణ మరియు దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్, తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు మరియు ఆలయ అర్చకులు మంత్రిని పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం దిల్ రాజు కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి కొండా సురేఖ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను మంత్రి వీక్షించారు. భక్తులతో కలిసి స్వామివారి సేవలను దర్శించుకున్న మంత్రి, ఆలయ సంప్రదాయాలు మరియు నిర్వహణపై అర్చకులు, నిర్వాహకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఇందూరు తిరుమలగా పేరుపొందిన ఈ పవిత్ర క్షేత్రం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందిస్తూ ప్రాంతీయంగా ప్రముఖ ధార్మిక కేంద్రంగా ఎదుగుతుండటం ఆనందకరమని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మేయర్, జిల్లా డీసీసీ అధ్యక్షుడు, నుడా చైర్మన్, ఇతర ప్రజాప్రతినిధులు, ఆలయ అర్చకులు, నిర్వాహకులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆయుష్ మందుల నాణ్యత, సరఫరాపై లోక్‌సభలో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ

**దశ, హనుమకొండ:** వరంగల్ జిల్లాలో ప్రభుత్వ ఆయుష్ వైద్య సంస్థల్లో మందుల నాణ్యత, నిరంతర సరఫరాపై వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు. గత మూడు సంవత్సరాల్లో వరంగల్‌లోని ప్రభుత్వ ఆయుష్ కేంద్రాల్లో మందుల నాణ్యతపై ఎలాంటి తనిఖీలు నిర్వహించారో వివరాలు ఇవ్వాలని కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖను ఎంపీ కోరారు.



అలాగే ఆయుష్ వైద్య కేంద్రాల్లో సరఫరా అయ్యే మందులపై సంవత్సరం వారీగా చేసిన తనిఖీలు, సేకరించిన నమూనాలు, పరీక్షల ఫలితాలు, నాసిరకం లేదా నకిలీగా తేలిన మందుల వివరాలు తెలియజేయాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించని తయారీదారులు లేదా సరఫరాదారులపై తీసుకున్న చర్యలు — లైసెన్స్ సస్పెన్షన్, రద్దు, బ్లాక్‌లిస్టింగ్, బకాయిల వసూళ్లు, కేసులు నమోదు వంటి చర్యలపై వివరాలు కోరారు. అదేవిధంగా, ఆయుష్ మందుల కొరత లేకుండా ఉండేందుకు నేషనల్ ఆయుష్ మిషన్ (NAM) లేదా ఇతర కేంద్ర పథకాల కింద డిజిటల్ స్టాక్ మానిటరింగ్ వ్యవస్థ అమలు చేస్తున్నారా అనే అంశంపై కూడా ఎంపీ ప్రశ్నించారు. దీనికి సమాధానంగా కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాధవ్ మాట్లాడుతూ ప్రజారోగ్యం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండే అంశమని తెలిపారు. తెలంగాణలోని వరంగల్ సహా అన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ ఆయుష్ ఆసుపత్రులకు నాణ్యమైన మందుల సరఫరా బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన వివరాల ప్రకారం ఆయుష్ విభాగం ద్వారా మందుల నమూనాలను యాదృచ్ఛికంగా, బ్యాచ్ వారీగా సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. నాణ్యత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన మందులనే ఆసుపత్రులకు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. నాణ్యతలో లోపాలు తేలితే సరఫరాదారులు తమ ఖర్చుతోనే మందులను వెనక్కి తీసుకుని కొత్తవి అందజేయాల్సి ఉంటుందని తెలిపారు.

అలాగే తెలంగాణలో ఈఔషధి (eAushadhi) డిజిటల్ వ్యవస్థను అమలు చేసి ఆయుష్ మందుల నిల్వలు, సరఫరాను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఆయుష్ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు లేదా వైద్యాధికారులు ఈ వ్యవస్థ ద్వారా మందుల కోసం ఇండెంట్ పెట్టే అవకాశం ఉందని, స్టాక్ వివరాలు ఆన్లైన్లో అందుబాటులో ఉండటంతో అక్రమాలు, కొరతలను నివారించవచ్చని పేర్కొన్నారు. వరంగల్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఆయుష్ వైద్య వ్యవస్థ బలోపేతంపై ఎంపీ డా. కడియం కావ్య నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

## మద్యం సేవించి వాహనం నడిపిన 26 మందికి రూ.2,54,000 జరిమానా, ముగ్గురు వ్యక్తులకి ఒక్కొక్కరికి ఐదు (05) రోజుల జైలు శిక్ష..




**దశ, సిద్దిపేట్:** సిద్ధిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్, తన సిబ్బందితో కలిసి గత కొన్ని రోజుల క్రితం సిద్దిపేట పట్టణ పరిసర ప్రాంతాలలో వాహనాలు తనిఖీ చేయగా 26 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొని బ్రీత్ ఎనలైజర్ తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు రాగా 13మార్చి2026 సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కాంతారావు, న్యాయమూర్తి, ముందు హాజరుపరచగా విచారణ చేసి 26 మంది వ్యక్తులకికలిపిరూ.2,54,000 జరిమానా విధిస్తూ ముగ్గురుకి 05 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని ఇద్దరికీ కలిపి రూ. 10,000 జరిమాన విధించినారు.జైలు శిక్ష విధించినవ్యక్తివివరాలు.కలకుంట్ల మహేష్, వయసు 34 సం, వృత్తి. డ్రైవర్ , నివాసం ఇబ్రహీంనగర్ చిన్నకోడూరు మండలం ,సిద్దిపేట జిల్లా .ఐదు (05) రోజులు జైలు. దీపక్, వయసు. 25 సం. వృత్తి. డ్రైవర్, నివాసం బీదర్, కర్ణాటక రాష్ట్రం. రూ,10,500 జరిమానా ఐదు రోజుల జైలు, ఫతులి కుమార్,వయసు. 28సం.వృత్తి.డ్రైవర్ నివాసం బీహార్ రాష్ట్రం రూ. 10,000 జరిమానా ఐదు రోజుల జైలుఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ ప్రవీణ్ మాట్లాడుతు.. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని కట్టడి చేయడానికి, ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వారికి ప్రమాదం రోడ్డుపై వెళ్లే ఇతర వాహనదారులకు కూడా ప్రమాదమని ప్రమాదాల నివారణ గురించి మాత్రమే డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించడం జరుగుతుందన్నారు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్లో పట్టుబడిన వారిని కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ గారు విచారణ జరిపి 10 వేల రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. పదివేల రూపాయలు కట్టడం వల్ల మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ప్రజల్లో వాహనదారుల్లో అవగాహన రావడం జరుగుతుందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని సూచించారు నడిపినచో ఒక్కొక్కరికి 5000 రూపాయల జరిమానా విధించడంజరుగుతుందన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మాత్రమే ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

# కొమురవెల్లి మల్లన్నకు కాసుల పంట

- *28 రోజుల్లో కోటి దాటిన ఆదాయం*



**దశ, కొమురవెల్లి:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారి దేవస్థానంలో భక్తులు మొక్కుల రూపంలో సమర్పించుకున్న హుండీ ఆదాయాన్ని శుక్రవారం (13032026) ఆలయ కార్యనిర్వహణాధికారి ఆధ్వర్యంలో లెక్కించారు. గత 28 రోజులకు గాను స్వామివారికి భారీగా ఆదాయం సమకూరినట్లు అధికారులు వెల్లడించారు.

ఆదాయ వివరాలు ఇలా..

మొత్తం 28 రోజుల కాలానికి భక్తులు సమర్పించిన కానుకల వివరాలను ఈఓ గారు ప్రకటించారు:

* నగదు: ₹1,20,29,945/ (కోటి ఇరవై లక్షల ఇరవై తొమ్మిది వేల తొమ్మిది వందల నలభై ఐదు రూపాయలు)
* మిశ్రమ బంగారం: 89 గ్రాములు
* మిశ్రమ వెండి: 6 కిలోల 100 గ్రాములు
* విదేశీ కరెన్సీ: 34 నోట్లు

లెక్కింపులో పాల్గొన్న ప్రముఖులు


ఈ హుండీ లెక్కింపు కార్యక్రమం పారదర్శకంగా, పోలీసు భద్రత మధ్య జరిగింది. కార్యక్రమంలో ఈ క్రింది అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు:

* పర్యవేక్షణ: శ్రీ డి. కృష్ణ ప్రసాద్ (ఆలయ కార్యనిర్వహణాధికారి), శ్రీమతి పి. విజయలక్ష్మి (దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్, సిద్దిపేట డివిజన్).
* అధికారులు: బుద్ధి శ్రీనివాస్, ఆర్. సుదర్శన్ (సహాయ కార్యనిర్వహణాధికారి), ఎన్. చంద్రశేఖర్ (పర్యవేక్షకులు).
* ఆధ్యాత్మిక బృందం: పి. మల్లయ్య (స్థానాచార్యులు), మహదేవుని మల్లికార్జున్ (ఆలయ ప్రధాన అర్చకులు).
* కమిటీ సభ్యులు: గంగం నర్సింహ రెడ్డి, బొచ్చు ఎల్లయ్య, ఏ. మల్లేశం, సత్యనారాయణ.

వీరితో పాటు శ్రీ లలిత సేవ సమితి సభ్యులు, ఆలయ సిబ్బంది, అర్చకులు, పోలీస్ సిబ్బంది, స్వర్ణకారుడు నర్సింహాచారి మరియు TGB బ్యాంకు సిబ్బంది ఈ లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్నారు.

>నోట్ : భక్తుల రద్దీ పెరుగుతుండటంతో స్వామివారి ఆదాయం కూడా క్రమంగా పెరుగుతోందని ఆలయ వర్గాలు తెలిపాయి.

# తెలంగాణ తిరుపతి చిల్పూర్ శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానం



**దశ, ఘనాపూర్:** స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గం చిల్పూర్ మండల కేంద్రంలో శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటే తిరుపతి వెంకన్న స్వామిని దర్శించుకున్నట్లే. శ్రీధర్ రావు భక్తి భావంతోనే కాదు సేవా భావంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారు.ఆలయ అభివృద్ధికి 10కోట్లతో మాస్టర్ ప్లాన్ రూపొందించాలి. రెండు నెలల్లో ముఖ్యమంత్రి గారి నుండి 10కోట్ల నిధులు మంజూరు చేయిస్తా. ఏడాదిలో 10కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేసే బాధ్యత నాది. ఆలయ అభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలి. ఏడాదిలో చిల్పూర్ శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని 10కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తి చేసి భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తానని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.

చిల్పూర్ మండల కేంద్రంలోని శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కి ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీర్వచనాలు అందజేశారు. ఆ తర్వాత ఆలయ ఈవో అధ్యక్షతన ఏర్పాటు చేసిన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆలయ పాలక వర్గంతో దేవాదాయ శాఖ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పాలక వర్గం ఆలయ పాలక వర్గం చైర్మన్ గా పొట్లపల్లి శ్రీధర్ రావు ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాపై నమ్మకంతో ఆలయ కమిటీ చైర్మన్ గా రెండవసారి అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి కి ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ పొట్లపల్లి శ్రీధర్ రావు భక్తి భావంతోనే కాకుండా సేవా భావంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. శ్రీధర్ రావు గారు స్వంత ఖర్చులతో ఆలయంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. చిల్పూర్ శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. చిల్పూర్ బుగులు వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుంటే తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నట్లే అని అన్నారు. చిల్పూర్ ఆలయ అభివృద్ధికి 10కోట్లతో మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ 10కోట్ల నిధులను ముఖ్యమంత్రి ని కలిసి రెండు నెలల్లో మంజూరు చేయిస్తానని తెలిపారు. ఏడాదిలో 10కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేసి భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఆలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించనున్నట్లు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఆలయానికి ఎదురుగా ఇండ్లు నిర్మించుకున్న వాటికీ వేరే చోట ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఇప్పటికే ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా హద్దులు నాటి ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గ్రామస్తులు సహకరిస్తేనే ఆలయ అభివృద్ధి సాధ్యం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో లక్ష్మి ప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, పాలక వర్గ సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ అర్చకులు, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించాలి

❖ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**దశ, పరకాల:** పట్టణ కేంద్రంలోని మున్సిపాలిటీ సమావేశ మందిరంలో చైర్మన్ పావుశెట్టి సునీల్ అధ్యక్షతన నిర్వహించిన సాధారణ కౌన్సిల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని, పట్టణ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు పట్టణ ప్రజల సమస్యలను గుర్తించి వాటికి తక్షణ పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా అందేలా కృషి చేయాలని సూచించారు తాగునీరు, పారిశుధ్యం, తదితరా అంశాలపై చర్చించారు.

## ఎస్సీ కాలనీ లోని ప్రజల పదేళ్ల చిరకాల కలను నెరవేర్చిన ఎమ్మెల్యే



**దశ, వర్ధన్న పేట:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 64వ డివిజన్ పరిధిలోని టేకులగూడెం గ్రామ ఎస్సీ కాలనీలో చాలా సంవత్సరాలుగా కొనసాగుతున్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. గత పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం మరియు అప్పటి ఎమ్మెల్యేలకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా సమస్య పరిష్కారం కాలేదని కాలనీ వాసులు తెలిపారు. దాదాపు 10 నుండి 15 సంవత్సరాలుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గత నెల రోజుల క్రితం వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు దృష్టికి సమస్యను తీసుకెళ్లగా వెంటనే స్పందించారు. కేవలం రెండు నెలల వ్యవధిలోనే రూ.25 లక్షల నిధులతో కొత్త పైప్‌లైన్ వేయించి కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించారు. దీంతో ఎస్సీ కాలనీ వాసులు, ముఖ్యంగా మహిళలు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకి కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తమ సమస్యను త్వరితగతిన పరిష్కరించిన ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఎస్సీ కాలనీ ప్రజలు పదేళ్లుగా ఎదురుచూస్తున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించడం ఎంతో ఆనందంగా ఉంది.

## ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలో 'ఇగ్నైట్–2026' విజయవంతం



**దశ, ఓయూ:** ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలోని మైనింగ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మార్చి 12, 13 తేదీలలో నిర్వహించిన 'ఇగ్నైట్-2026' కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. మైనింగ్ రంగంలో భద్రత, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే లక్ష్యంతో విద్యార్థులు రూపొందించిన సాంకేతిక నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డ్రోన్, ఐఓటీ, కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్ ఆధారంగా రూపొందించిన నమూనాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రారంభ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ జనరల్ మేనేజర్ తాడబోయిన శ్రీనివాస్, KNRHC & BB కోల్ మైన్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ మోహన్ రెడ్డి కలసాని, ఎస్ఆర్ మినరల్స్ వ్యవస్థాపకుడు రామకృష్ణ పుట్టా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలించి సృజనాత్మకతను ప్రశంసించారు. ముగింపు కార్యక్రమానికి సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకన్న జాధవ్ ముఖ్య అతిథిగా హాజరై మైనింగ్ రంగంలో డిజిటలైజేషన్ అవసరాన్ని వివరించారు. బీజీఆర్ మైనింగ్ అండ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ డైరెక్టర్ బాలకోటిరెడ్డి మైనింగ్ ఇంజినీరింగ్ ప్రాముఖ్యతతో పాటు సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధి అవసరాన్ని పేర్కొన్నారు.

## మార్చి14న తెలంగాణ సాయుధ పోరాటం యోధుల 78 వర్ధంతి సభ

❖ హాజరు కానున్న సిపిఐ సీనియర్ నేత మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

❖ 78వ వర్ధంతి సభకు జయప్రదం చేయండి.

❖ సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, గడిపె మల్లేశ్ పిలుపు




**దశ, సిద్దిపేట్:** పేదలకు భూమి భుక్తి నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణ ప్రజల విముక్తి కోసం అలుపెరుగని ప్రజా పోరాటాలు నిర్వహించి వెట్టి చాకిరీని రద్దు చేసేందుకు నైజాం సర్కార్ తో అలు పెరగని పోరాటం చేసి1948 మార్చి 14న సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మహ్మదపూర్ గ్రామంలోని భూషణ గట్లల్లో ఎన్ కౌంటర్ లో అమరులైన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) కరీంనగర్ జిల్లా ప్రథమ కార్యదర్శి అమరజీవి అనభేరి ప్రభాకర్ రావుతో పాటు కామ్రేడ్ సింగిరెడ్డి భూపతి రెడ్డి,కామ్రేడ్ ముస్కు చొక్కారెడ్డి,కామ్రేడ్ ఏలేటి మల్లారెడ్డి, కామ్రేడ్ అయిరెడ్డి భూంరెడ్డి,కామ్రేడ్ తూమోజు నారాయణ,కామ్రేడ్ బి.దామోదర్ రెడ్డి,కామ్రేడ్ ఇల్లందుల పాపయ్య, కామ్రేడ్ పోరెడ్డి రాంరెడ్డి,కామ్రేడ్ నల్లగొండ రాజారాం కామ్రేడ్ సిక్కొడు సాయిల్,కామ్రేడ్ రోండ్ల మాధవరెడ్డి (12) మంది అమరవీరుల స్మారక స్థూపం వద్ద 78వ వర్ధంతి సందర్భంగా ఈ నెల14 శనివారం నాడు అమరులకు నివాళులు అర్పించి అనంతరం మహ్మదపూర్ గుట్టల్లో అమరులైన వారి సమాధుల వద్ద పూల మాలలు వేసి ఘనంగా నివాళులు శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం మహ్మదపూర్ మృత వీరుల సంస్మరణ సభ జరుగుతుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్ తెలిపారు.శుక్రవారం రోజున ఆయన విలేఖరులతో మాట్లాడుతూ మార్చి 14న జరిగే మహ్మదపూర్ అమరవీరుల సంస్మరణ సభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, కరీంనగర్ జిల్లా సిపిఐ కార్యదర్శి పంజాల శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ తోపాటు తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల కుటుంబ సభ్యులు, సిపిఐ జిల్లా కార్యవర్గ,కౌన్సిల్ సభ్యులు,హుస్నాబాద్ నియోజకవర్గ కార్యవర్గ, జిల్లా కౌన్సిల్ సభ్యులు, నాయకులు మండల కార్యదర్శులు హాజరవుతున్నారని సిపిఐ నాయకులు,కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

❖ కాంగ్రెస్ హయాంలోనే మైనారిటీల ఆత్మగౌరవం



**దశ, హనుమకొండ:** వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి జక్రియా ఫంక్షన్ హాల్‌లో ఘనంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న హనుమకొండ డిసిసి అధ్యక్షులు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొని, వారితో మమేకమై పవిత్ర రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, సీనియర్ నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సీనియర్ మైనారిటీ నాయకులు,కార్పొరేటర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ రంజాన్ మాసం క్రమశిక్షణకు, దాతృత్వానికి మరియు సోదరభావానికి నిదర్శనమని, కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి ఉండటమే కాంగ్రెస్ ప్రభుత్వ ఆశయమని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, అన్ని వర్గాల అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచుతూనే, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా ప్రజల మధ్య బంధాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కృషితో ఇంత పెద్ద ఎత్తున ముస్లిం సోదరులందరూ ఒకే చోట చేరి విందు ఆరగించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మైనారిటీ నేతలు మరియు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉచిత గాలికుంటు టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

❖ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి



**దశ, తుంగతుర్తి:** ప్రభుత్వం అందించే పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కుంచాల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అన్నారం గ్రామంలో పశువులకు ఉచిత గాలికుంటు నివారణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం పశువులకు ఉచిత గాలి కుంటూ మందులను పంపిణీ చేశారు. పశువులు రోగాలు బారిన పడకుండా ఈ టీకాలు వేసినట్లయితే ఆరోగ్యంగా ఉంటాయని అన్నారు. గ్రామంలో ఈ టీకాలు ఈరోజు నుండి మూడు రోజుల వరకు పశు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వేస్తారని అన్నారు. కావునప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలో ఆవులు 31, గేదలు 76 మొత్తం 107 పశువులకు టీకాలు వేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెలిశాల సరిత, మండల పశు వైద్య అధికారి నరేష్, సిబ్బంది రవి, రాజశేఖర్, లింగయ్య, శ్రీను, రైతులు పాల్గొన్నారు.

## జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే ఎల్పిజి గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదు

❖ వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు : జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్.



**దశ, సూర్యాపేట ప్రతినిధి :** సూర్యాపేట జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ లకు ఎలాంటి కొరత లేదని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. శుక్రవారం అయన అదనపు కలెక్టర్ చాంబర్లో జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీలు, పౌరసరఫరాల అధికారులతో ఎల్పిజి గ్యాస్ సరఫరాపై సమావేశం నిర్వహించారు. గృహ అవసరాలకు వినియోగించే ఎల్పిజి గ్యాస్ సరఫరా లో ఏలాంటి కొరత లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్యాస్ బుక్ చేసుకున్న రెండు మూడు రోజుల్లోనే వినియోగదారులకు సకాలంలో డెలివరీ చేయడం జరుగుతుందని వివరించారు. కమర్షియల్ సరఫరాలో ఏర్పడిన కొరతను అధిగమించేందుకు ఉపశమనం వైపు చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని తెలిపారు.గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్‌ను ఎవరైనా కమర్షియల్ గా వాడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. గృహ అవసరాలకు వినియోగించే ఎల్పిజి గ్యాస్ సరఫరాలో ఎలాంటి కొరతలేనందున ప్రజలు ఆందోళనకు గురై అనవసరంగా గ్యాస్ బుక్ చేసుకోవద్దని కోరారు. సీనియారిటీ ప్రకారం ఏజెన్సీలు గ్యాస్ ను సరఫరా చేయడం జరుగుతున్నదని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సరిపోయినంతగా ఉందని కలెక్టర్ మరోసారి చెప్పారు. గ్యాస్ బుకింగ్ కు సంబంధించి సర్వర్ సమస్యలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై కూడా ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ విషయమై సంబంధిత గ్యాస్ ఏజెన్సీ లతో మాట్లాడడం జరిగిందని, త్వరలోనే సర్వర్ సమస్యను పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎవరైనా ఏజెన్సీ నిర్వాహకులు అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, జిల్లా పౌర సరఫరా అధికారి మోహన్ బాబు, జిల్లా మేనేజర్ సివిల్ సప్లై రాము, తదితరులు పాల్గొన్నారు.

## పుస్తెలతాడు సైజు పేరుతో మోసం: ఇద్దరు నిందితుల అరెస్ట్




**దశ, సిద్దిపేట్:** నమ్మించి మోసానికి పాల్పడి, అసలు పుస్తెలతాడు స్థానంలో నకిలీది ఇచ్చి దొంగతనానికి పాల్పడ్డ ఇద్దరు వ్యక్తులను సిద్దిపేట టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుండి బంగారు పుస్తెలతాడును రికవరీ చేసి, వాళ్ల ని రిమాండ్‌కు తరలించారు.కేసు వివరాలు:గజ్వేల్ ఆర్ &ఆర్ కాలనీకి చెందిన గున్నాల అనురాధకు ఆమె మేనమామ కొడుకు అయిన ఎల్లరాజు (తండ్రి శ్రీనివాస్, నివాసం: సిద్దిపేట) గత ఏడాది డిసెంబర్ 19, 2025న ఫోన్ చేశాడు. తన భార్యకు కొత్త పుస్తెలతాడు చేయించాలని, అనురాధ మెడలో ఉన్న తాడు బాగుందని, దాని సైజు ఇస్తే అలాగే చేయిస్తానని నమ్మబలికాడు. అతని మాటలు నమ్మిన అనురాధ సిద్దిపేటకు రాగా, నిందితుడు ఆమెను పారుపల్లి వీధిలోని 'భానుశ్రీ జ్యువెలర్స్' షాపుకు తీసుకువెళ్లాడు. అక్కడ పనిచేసే గోల్డ్ స్మిత్ సిరికొండ నాగరాజుకు ఆ పుస్తెలతాడును ఇచ్చి, సైజు తీసుకోవడానికి సమయం పడుతుందని చెప్పి అనురాధను ఇంటి దగ్గర విడిచిపెట్టాడు. అనంతరం అంబేద్కర్ సర్కిల్ వద్దకు పిలిపించి ఆమెకు పుస్తెలతాడును తిరిగి ఇచ్చేశాడు. ఇంటికి వెళ్ళిన కొన్ని రోజుల తర్వాత అనురాధ తన వద్ద ఉన్న పుస్తెలతాడును పరిశీలించగా, అది నకిలీది అని గుర్తించింది. ఎల్లరాజు, గోల్డ్ స్మిత్ నాగరాజు కలిసి తన అసలు బంగారు తాడును కాజేసి, మోసం చేశారని గ్రహించిన బాధితురాలు సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదుచేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన టూ టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మార్చి 13, నిందితులైన ఎల్లరాజు, సిరికొండ నాగరాజులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి చోరీకి గురైన బంగారు పుస్తెలతాడును స్వాధీనం చేసుకుని, నిందితులను జుడిషియల్ రిమాండ్‌కు తరలించారు.పరిచయస్తులైనా, బంధువులైనా బంగారు ఆభరణాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నమ్మించి సైజులు అడిగే వారి పట్ల జాగ్రత్త వహించాలని సిద్దిపేట టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఉపేందర్ సూచించారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com